ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 17 మార్చి 2024



గృహ జ్యోతి పథకం నిరంతర ప్రక్రియ

జగిత్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గృహ జ్యోతి పథకం నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తుల గడువు తీరిపోతున్నదనే ఆందోళన వద్దని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో నిర్వహిస్తున్న గృహ జ్యోతి పథక దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని శనివారం చైర్ పర్సన్ పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదని అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లులు అందేలా చూస్తామన్నారు.



మోగిన నగారా

మే 13న పోలింగ్...జూన్ 4న కౌంటింగ్

పార్లమెంటు ఎన్నికల సమరానికి ఏర్పాట్లు పూర్తి

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా జరగబోయే పార్లమెంట్, కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. షెడ్యూల్ విడుదలై కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలలో, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గల ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోగల జిల్లాలోని చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం కొడిమ్యాల, మల్యాల మండలాల్లో, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లో లోక్‌సభ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారులను సైతం నియామకం చేశారు.

అధికారుల సమాయత్తం..

లోక్ సభ సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహించ నుండగా తెలంగాణలో నాలుగో విడతలో భాగంగా మే 13వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏప్రిల్ 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుండా ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ గా కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు ఆఖరు తేదీగా ప్రకటించింది. మే 13వ తేదీన పోలింగ్ నిర్వహించి జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది. ఈ మేరకు నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలను నిర్వహించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు.

జిల్లాలో 7,09,311 మంది ఓటర్లు...

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,09,311 ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 3,40,627 మంది, స్త్రీలు 3,68,650 మంది, ఇతరులు 34 మంది ఉన్నట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 18, 19 సంవత్సరాలు వయస్సు గల ఓటర్లు 20,796 ఉండగా పురుషులు 11,2382, మహిళలకు 9,512, ఇతరులు 2 మంది ఉన్నారు. అదే విధంగా 20 నుంచి 29 లోపు వయస్సు గల ఓటర్లు 1,50,551 మంది ఉండగా పురుషులు 75,299 మంది, స్త్రీలు 75,233 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు. జిల్లాలో 31,954 మంది దివ్యాంగ ఓటర్లుండగా పురుషులు 15,374, స్త్రీలు 16,578, ఇతరులు 2 మంది ఉన్నారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారిగా లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం తహసీల్దార్‌గా హకీంలు వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్ డేట్ చేస్తున్నారు.

పోలీసుశాఖ అప్రమత్తం...

ఎన్నికలకు ముందుగానే పోలీసు శాఖ భద్రత పరంగా అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ అందించారు. కోడ్ అమలు నుంచి పో లింగ్, లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అత్యంత కీలకమైన శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో పరిధిలో నిర్వర్తించాల్సిన విధులపై రూట్ మ్యాప్ తయారు చేశారు. వామపక్ష, ప్రభావిత, సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. అంతరాష్ట్ర, జిల్లాల పోలీసులు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే జిల్లాకు పోలీసు సిబ్బందికి సహాయంగా సేవలు అందించడానికి సీఐ ఎస్ఎఫ్ కంపెనీ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వచ్చాయి. ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు జరగకుండా ని యంత్రిచడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారు. క్రిటిక్ పోలింగ్ స్టేషన్లు, రూట్ బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది ఉంచనున్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు భద్రత భావాన్ని కలిగించడానికి పోలీసులు ప్రయత్ని స్తున్నారు. జిల్లాలో ఏడు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కోరుట్ల నియోజ కవర్గంలో 2, జగిత్యాల నియోజకవర్గంలో 2, ధర్మపురి, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తాం

షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్



లోక్ సభ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకున్నాము. ఎన్నికల సం ఘం మార్గ దర్శకాల మేరకు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాము. జిల్లాలో అవస రమైన పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా, ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు తదితర అంశాల న్నింటిపై దృష్టి సారించాము. ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలి.

జిల్లాలో 785 పోలింగ్ స్టేషన్లు...

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో 785 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కోరుట్లలో 362, జగిత్యాలలో 254, ధర్మపురి లో 269 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 138 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా సుమారు 400కు పైగా వాహనాలను ఎన్నికల కోసం ఉపయోగించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా సుమారు 4,600 మంది ఉద్యోగులు, సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. ఇందులో రిటర్నింగ్ అధికారి, పీవో, ఏపీవోలు, ఇతర ఎన్నికల సిబ్బంది ఉంటారు. అదే విధంగా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్ట రేట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి పర్య వేక్షిస్తు న్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అయిదుగరు చొప్పున సిబ్బందిని నియ మించనున్నారు. అదనంగా మరో 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వులో పెట్టేలా సమాచారం తీసుకున్నారు. జి ల్లాలో 18 మంది అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 18 మంది అధికారులతో స్టాటిక్ సర్వే లైన్ బృందాలు, 18 మంది అధికారులతో మోడల్ కండక్ట్ ఆఫ్ కోడ్ బృందాలు, 6 గురితో వీడియో వ్యూయింగ్ బృందాలు, 91 మంది సెక్టోరల్ అధికారులను ఏర్పాటు చేశారు.



కొత్త అధికార యంత్రాంగంతోనే...

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికార యంత్రాంగ మంతా అన్ని రకాల శిక్ష ణలు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే గెజిటెడ్ స్థాయి అధికారి నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు బదిలీలు జరిగాయి. స్థానికత, మూడేళ్ల సర్వీసు పూర్తి తదితర నిబంధనల ప్రకారమే ప్రస్తుతం అధికారులు ఉన్నారు. జిల్లాలో చాలా వరకు కొత్త అధికార యం త్రాంగమే ఉంది. ఎన్నికల్లో పారదర్శకత, నిష్పక్షపాతంగా పని చేసేందు కు ఈ ఏర్పాట్లు చేశారు. ఈవీఎంల ర్యాండమైజేషన్లు, పరిశీలనలు చేపట్టారు. ఇప్పటికే పోలింగ్‌కు చెందిన రిసిప్షన్ కేంద్రాలను గుర్తించారు. ఇక ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి తుది జాబితా ప్రకటించారు. 18 ఏళ్ల నిండిన వారందరికి ఓటు హక్కు కల్పించేలా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి హక్కు కల్పించారు. గత ఎన్నికల్లో ప్రతీ పోలింగ్ కేంద్రానికి 1500 మంది ఓటర్ల ఉండగా, అదనంగా మరో వంద మంది వరకు పెంచి, 1600 మంది ఓటర్ల వరకు ఓటేసేందుకు వీలు కల్పించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన...

పోలింగ్ కేంద్రాల పెంపు, ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ప్రత్యేక పోత్యేక పోలింగ్ కేంద్రాలు, ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో ట్యాగింగ్, పోల్ చీటిపై మ్యాపింగ్, ఫొటోలతో కూడిన ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్, ప్రత్యేక బృందాల ఏర్పాట్లు కమిటీలను నియమించారు. ఇక ఎన్నికల విధుల కోసం ఇప్పటికే ఆయా శాఖల నుంచి అధికారుల జాబితాలు వెళ్లాయి. నిబంధనల మేరకు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు విధులు కేటాయించనున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

పీఎం బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో నిర్వహించనున్న ప్రధాన మంత్రి బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్ గార్డెన్‌లో శనివారం బందోబస్తు ఏర్పాటుపై పోలీస్ అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభకు దాదాపు ఎనిమిది జిల్లాల నుంచి 1,600 మంది అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నట్లు వివరించారు. బందోబస్తును సెక్టార్ల వారిగా విభజించి ఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించామన్నారు. బందోబస్తుకు రానున్న అధికారులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులకు తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతతో, ఐడీ కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద విధులు నిర్వహించే అధికారులు ఎవరిని రానివ్వకుండా అలర్ట్‌గా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రఘు చందర్, ఉమామహేశ్వర్ రావు తో పాటు వివిధ జిల్లాలె డీఎస్పీలు, సీఐలు ఉన్నారు.

వడ్డీలేని రుణం మహిళలకు వరం

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుంబిగిస్తోందని ఇందులో భాగంగానే వడ్డీలేని రుణాలు మహిళలకు వరంగా మారనున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని హర్షిస్తూ శనివారం మెప్మా ఆర్పీల ఆధ్వర్యంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించగా చైర్ పర్సన్ హాజరై మాట్లాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందని వివరించారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న గొప్ప ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు పిప్పరి అనిత ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పెగడపల్లి, మార్చి 16 : మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం ధర్మపురి ఏడిఏ రాంచంద్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెగడపల్లి, నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు పలు డీలర్ల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల విక్రయాల తీరు, స్టాక్ రిజిస్టర్‌లు, దుకాణాలలో స్టాక్‌లు, ధరల పట్టికలు, బిల్లు బుక్‌లు పరిశీలించారు. నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని, ప్రతి కొనుగోలుదారుడికి విధిగా బిల్లు రశీదు అందించాలన్నారు. ఏడీఏ రాంచంద్రం, ఏఈవో నవీద్ ఉన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని మూడు, పూడూర్‌లోని మూడు ఫెర్టిలైజర్ దుకాణాలను శనివారం ఏవో పి. జ్యోతి తనిఖీ చేశారు. దుకాణాలలోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించారు. అగ్గి తెగులు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కలిపించారు. ఏవో వెంట ఏఈవో గ్రీష్మ, పలువురు రైతులు ఉన్నారు.

ఆరు నెలల్లో యావర్ రోడ్డును విస్తరిస్తాం

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

అధికారులతో సమీక్షా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల్లో యావర్ రోడ్డును 100 పీట్లకు విస్తరిస్తా మని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించి మాట్లాడారు. యావర్ రోడ్డు విస్తరణ కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైం దన్నారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి స్థలాలు కోల్పోయిన వారికి రూ. 100 కోట్ల నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి కరీంనగర్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ కోసం రూ. 14 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పదవి బీసీ మహిళకు కేటాయించిన స్థానాన్ని సంవత్సర కాలం నుంచి భర్తీ చేయకుండా గత ప్రభుత్వం వివక్ష చూపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే నిబంధనలు సవరించి ఎన్నికలు జరిగేలా చూసి బీసీ మహిళకు న్యాయం జరిగేలా చూశామన్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సిటీజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సేవలు అందించాలన్నారు.

భవన నిర్మాణాల కోసం అన్‌లైన్‌లో మాత్రమే ధరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడాది కాలంగా మున్సిపల్ పాలన అస్తవస్థ్యంగా మారిందని నూతన చైర్ పర్సన్ బాధ్యతతో పనిచేయాలన్నారు. సమావేశంలో చైర్ పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ అనిల్ బాబు ఉన్నారు.

గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట...

గంగపుత్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా గంగపుత్ర సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. సంక్షేమంలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలుపడమే లక్ష్యంగా సీఎం ముందుకు వెళుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, ఫిషర్ సెల్ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు బింగి సుమ, కౌన్సిలర్లు దుర్గయ్య, పద్మ సింగారావు, నాయకులు జగన్, శంకర్ ఉన్నారు. సారంగపూర్ మండలం బట్టపెల్లి గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ నాయకులు, బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఘన సన్మానం


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను జగిత్యాలలో పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం జగిత్యాల పర్యటనలో భాగంగా పట్టణంలోని గోవిందపల్లి, వెంకటాద్రి నగర్ కాలనీలో నివాసముంటున్న మేడిపల్లి మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుం దారపు జలేందర్‌ను ఆత్మీయతతో కలిశారు. తన నివాసానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు మాజీ జడ్పీటీసీ సభ్యుడు జలేందర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగ తం పలికారు. ఆత్మీయ తేనేటీ విందును అందించారు. మేడిపల్లి, బీమారం మండలాల్లోని పరిస్థితి, సమస్యలు, అభివృద్ధి తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల మాజీ ఎంపీపీ కుందారాపు రవీందర్-అన్నపూర్ణ, బీమారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు బద్దం రాజేందర్ రెడ్డి, యువ జన నాయకుడు కుందారపు రాజేందర్ పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండలంలోని దేశాయిపేట గ్రామంలో రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, పట్నాల కార్యక్రమం శనివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 16: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మతి స్థిమితం లేని వ్యక్తి(53) శనివారం రాత్రి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డుపై నుంచి నడుచుకుంటూ తిమ్మాపూర్ వైపునకు వెళుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఎల్లారెడ్డిపేట నుంచి కామారెడ్డి వైపునకు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖనిలో గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో నలుగురు యువకులు

కోల్‌సిటీ, మార్చి16: గోదావరిఖని గంగానగర్‌లో శనివారం తెల్లవారు జామున నలుగురు యువకుల వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్థుల నుంచి ఈ గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

హుజూరాబాద్‌లో ఒకరి అరెస్టు

హుజూరాబాద్, మార్చి 16: హుజూరాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్ట సమీపంలోని ఒడ్డెర కాలనీకి చెందిన దుండుగుల వెంకటేష్ అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శనివారం టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. వెంకటేష్‌పై గతంలో గంజాయి కేసు నమోదు కాగా పరారీలో ఉన్నాడు. పట్టణ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటేష్ పోలీసులను చూసి పారిపోతుండగా, పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటలో వడగళ్ల వాన



అడవిపదిరలో కురిసిన వడగళ్లు



వన్‌పల్లిలో వడగళ్ల వానకు నేలకొరిగిన వరిపంట

వీర్నపల్లి, మార్చి 16: వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, అడవి పదిర, రంగంపేట గ్రామాలతో పాటు పలు తండాల్లో శనివారం సాయంత్రం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి పొట్టదశకు వచ్చిన వరిపంట భారీస్థాయిలో దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలుచోట్ల వరిపంట నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అడవిపదిరలో రెండు కరెంట్ స్తంభాలు నేలకూలాయి. ఇంకా 15 నుంచి నెల రోజులకు కోతలు ప్రారంభం కానుండడంతో ఇంతలోనే వడగళ్లతో రైతులకు కడగండ్లు మిగిల్చనుందని వారు వాపోయారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఆకాశమంతా మేఘావృతమై వానపడడంతో రహదారులు నీటితో నిండిపోయాయి. మండల కేంద్రంతో పాటు పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట, గుండారం, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో వడగళ్ల వాన పడింది. పొట్టదశకు వచ్చిన వరి పంట చేతికందకుండాపోతోందని రైతులు ఆందోళన చెందారు. నష్టం మిగుల్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రుద్రంగిలో దుకాణాల్లోకి చేరిన వరదనీరు

రుద్రంగి, మార్చి 16: రుద్రంగి మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారికి ఇటీవల ఎత్తు పెంచడంతో దుకాణ సముదాయాలు కిందికి కావడంతో శనివారం రాత్రి కురిసిన వర్షానికి బస్టాండ్ నుంచి ఇందిరాచౌక్ వరకు గల దకాణాల్లోకి వరద నీరు వెళ్లింది. ఇందిరాచౌక్‌లోని ఓ బట్టల దుకాణంలో బట్టలు తడిసి ముద్దయ్యాయి. వరద నీరు దుకాణాల్లోకి రాకుండా మురికికాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, దుకాణదారులు కోరుతున్నారు.



దుకాణంలోకి చేరిన నీరు

పోలీసు కస్టడీకి మాజీ తహసీల్దార్

కరీంనగర్ అర్బన్, మార్చి 16: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాకుండా బాధితుడి భూమిని ఆక్రమణకు పాల్పడిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను పోలీసులు 48 గంటల కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకోగా సోమవారం ఉదయం 10 గంటలకు మళ్లీ జైలుకు తరలించనున్నారు. కస్టడీకి తీసుకున్న అనంతరం ఎమ్మార్వోను అతని ఇల్లు, గెస్ట్‌హౌస్‌లకు తీసుకువెళ్లి సోదాలు నిర్వహించారు. ఎమ్మార్వోపై నమోదైన కేసుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



శ్రీనివాస్‌ను అతని ఇంటికి తీసుకెళ్తున్న పోలీసులు

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు

మల్యాల, మార్చి 16: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంధ పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల ముగింపు రోజు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ మారుతీ, ఏఈవో అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● నూతన విగ్రహాల ప్రతిష్ఠ

ఆలయంలో నూతనంగా సీతా,రామ,లక్ష్మణ, బేతాళుడు, పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వీటిని పలువురు భక్తులు దేవస్థానానికి అందించగా ప్రతిష్ఠించడానికి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ప్రాణప్రతిష్ఠ అనంతరం యాగశాల, ప్రధాన ఆలయంలో ప్రతిష్ఠించారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ స్వాధీనం

● రెండు క్రషర్ల యజమానులపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 16: అనుమతి లేకుండా జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్స్ వినియోగిస్తున్న క్రషర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి తెలిపారు. శనివారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఎస్‌హెచ్‌వో , ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన మీరాల భాస్కర్ జిల్లెల్ల గ్రామ శివారులోగల శాంభవి స్టోన్ క్రషర్ మేనేజింగ్ పార్టనర్‌గా ఎనిమిది సంవత్సరాలుగా క్రషర్ వ్యవహారాలు చూసుకుంటున్నాడు. శాంభవి క్రషర్ పక్కనే ఉన్న గుట్టను బ్లాస్ట్ చేయడానికి సిద్దిపేటకు చెందిన విజయ్ ఎక్స్‌ప్లోజివ్ షాప్‌లో ఎక్స్‌ప్లోజివ్స్‌ను తీసుకువచ్చి ఆ గుట్టకు అమర్చి గుట్టను పేల్చి బండను సేకరిస్తున్నారు. నాలుగు నెలల క్రితం సిద్ధిపేటలోని విజయ్ ఎక్స్‌ప్లోజివ్స్ షాప్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఎక్స్‌ప్లోజివ్స్‌లను భాస్కర్ కొనుగోలు చేసి క్రషర్ పరిసర ప్రాంతాల్లో డస్ట్‌లో డంప్ చేశాడు.ఈ క్రమంలో గుట్టను బ్లాస్ట్ చేయడానికి కొంత ఎక్స్‌ప్లోజివ్స్ బయటకు తీసి గుట్టను బ్లాస్ట్ చేయడానికి చూస్తున్న క్రమంలో సమాచారం అందుకుని క్రషర్ దగ్గర భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని 83 ఎంఎం ,సైజ్ గల 87 జిలేటిన్ స్టిక్స్, 35 ఎంఎం సైజ్ గల 249 జిలాటిన్ స్టిక్స్, 20 మీటర్ల రెడ్ వైర్ స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఓగులపూర్ గ్రామా శివారులో ఉన్న చేమంతి స్టోన్‌క్రషర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చేమంతి స్టోన్ క్రషర్ యజమానులు అయిన సిరిసిల్ల పట్టణం రెడ్డివాడకు చెందిన మడుకు శ్రీకాంత్‌రెడ్డి, పెద్దూర్ గ్రామానికి చెందిన కసారం సాగర్‌బాబు అనే ఇద్దరు వ్యక్తులు స్టోన్ క్రషర్‌లో అక్రమంగా అనుమతి లేకుండా ఫ్యూజ్‌లు, డిటోనేటర్స్ జిలెటన్ స్టిక్స్‌లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందిదన్నారు. క్రషర్ లో తనిఖీలు నిర్వహించి 196 ఫ్యుజ్‌లు, 25 ఎంఎం జిలటిన్‌స్టిక్స్ 1087 , డిటోనేటర్స్ 897ఉండగా వాటిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



స్వాధీనం జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి : బీజేపీ

కరీంనగర్ టౌన్, మార్చి 16: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రధాని మోదీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో పార్లమెంట్ ముఖ్య నేతల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తప్పుడు హామీలు, భూటకపు మాటలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో 12 పార్లమెంట్ స్థానాల్లో గెలవబోతోందన్నారు. కవిత అరెస్టుకి బిజేపి కి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఓదెల మార్చి 16: మండల కేంద్రానికి చెందిన బిటెక్ విద్యార్థి ముద్దసాని వెంకట సాయి (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీటెక్ పూర్తి చేసి నాలుగేళ్లు అయినా కూడా, ఉద్యోగం రాలేదు. ఉద్యోగం కోసం పలు పోటీ పరీక్షలు రాసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మనస్థాపం చెందిన వెంకటసాయి శుక్రవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకుహైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 16: స్థానిక ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన ఎం వెంకటయ్య(85) అనే వృద్ధుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. మృతుని కొడుకు, కోడలు ఒక శుభకార్యం నిమిత్తం శుక్రవారం హైదరాబాద్ వెళ్లారు. వృద్ధాప్యంతో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడని, ఈ మేరకు మృతుని కుమారుడు బచ్చు శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ధర్మారం,మార్చి16: మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ బావిలో శనివారం మధ్యాహ్నం క్రేన్ సహాయంతో పూడిక తొలగిస్తుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లక్కాకుల రాజయ్యకు చెందిన వ్యవసాయ బావిలో గ్రామంలో ఉంటున్న సూర వెంకటస్వామి, తండ్రి సైదులు, తల్లి కళమ్మ, మరో ఇద్దరు కలిసి క్రేన్ సహాయంతో పూడిక తొలగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో వ్యవసాయ బావిలో సూర వెంకటస్వామి(22) పూడికను క్రేన్ డబ్బాలో పోస్తుండగా డబ్బాను ముట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా : డ్రైవర్ మృతి

సుల్తానాబాద్, మార్చి 16: సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం తెల్లవారుజాము ఐదున్నర గంటలకు లారీ బోల్తా పడింది. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాలతో ఉన్న డ్రైవర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స చెందుతూ మృతిచెందాడు. హైదరాబాద్ నుంచి చెత్త లోడ్‌తో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజానంద్‌గామ్‌లోని చెత్త ఆధారిత పవర్ ప్లాంట్‌కు వెళుతుండగా సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలపు వద్ద లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. మహారాష్ట్రలోని గుంధియా జిల్లా సిర్పూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రాజన్ లారీ క్యాబిన్‌లోనే తీవ్రగాయాలతో ఇరుక్కుపోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ శ్రావణ్‌కుమార్, పోలీసులు, గాజుల రాజమల్లు తదితరులు ఆస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మృతిచెందగా, క్లీనర్ హితేంద్ర మున్నాలాల్ తీవ్రంగా గాయపడ్డాడు.

వెంకయ్యకుంటలో చోరీ

ముస్తాబాద్, మార్చి 16: మండలంలోని వెంకయ్యకుంటలో శుక్రవారం చోరీ జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంకణాల మల్లవ్వ తన ఇంటికి తాళం వేసి తన కొడుకు ఇంటి దగ్గర పడుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోదాచి ఉంచిన రూ. 86 వేల నగదును చోరీ చేశారు. బంగారు రింగులు, పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి 16 : చొప్పదండి శివారులోని డి 87 కెనాల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు పట్టణంలోని ఝాన్సీ స్కూల్ దగ్గర కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం ఉందని లష్కర్ గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని బయటకి తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. 15 రోజుల క్రితమే చనిపోయినట్లు తెలుస్తుందని మృతుడు సుమారుగా 30 నుండి 40 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట ,మార్చి 16: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం బైకు అదుపుతప్పి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి రాగుల దేవయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రాయికల్, మార్చి 16: ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇటిక్యాలలో జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఇంటూరి సుభాష్ (25) కూలీ పనుల నిమిత్తం ఇటిక్యాలకు వలస వచ్చాడు. ఈ నెల 10వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో సుభాష్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఇటిక్యాల శివారులోని వ్యవసాయ బావిలో పడి చనిపోయాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, మార్చి 16 : మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులోని లింగాపూర్ క్రాస్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆగి ఉన్న ఓ లారీని వెనుక నుంచి టాటా ఏసీ ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరూ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం గ్రామానికి చెందిన కెమ్మసారపు తిరుపతి(40) శుక్రవారం హుజూరాబాద్‌లో ఉండే తన అమ్మను చూసేందుకు అదే గ్రామానికి చెందిన ఎండీ గఫార్‌తో కలిసి టాటా ఏసీ ఆటోలో బయల్దేరాడు. ఆటో సింగాపూర్ గ్రామ శివారులోని లింగాపూర్ క్రాస్ వద్దకు రాగా, చీకట్లో నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది.ఈ ఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి.. చెందగా గఫార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కెమ్మసారపు వెంకటలక్ష్మీ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మెట్‌పల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి, మార్చి, 16 : మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలపాలయ్యారు. శనివారం రాత్రి ఆరపేట బస్టాండ్‌లో బాదినేని భూమక్క, నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వలు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు గమనించి ముగ్గురిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి గాయాలపాలైన మహిళల వద్ద వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ టౌన్, మార్చి 16 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపలోకయుక్త జస్టిస్ వి నిరంజన్‌రావు కుటుంబ సమేతంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం వారికి శ్రీస్వామి వారి నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ సూపరిండెంట్ నాగుల మహేష్ రాజన్న ప్రసాదాన్ని అందేశారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రాజన్న ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు.

తండ్రిపై గొడ్డలితో తనయుడి దాడి

రాయికల్, మార్చి 16: మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన మ్యాకల అంజయ్య తన తండ్రి గంగారెడ్డిని డబ్బుల విషయంలో శుక్రవారం రాత్రి గొడ్డలితో దాడి చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ పేర్కొన్నారు. దీంతో గంగారెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గంగారెడ్డి చెల్లెలు బద్ది సులోచన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రధాని పర్యటన సందర్భంగా జగిత్యాలలో ట్రాఫిక్ ఆంక్షలు

జగిత్యాల టౌన్, మార్చి 16 : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 18న దేశ ప్రధాన మంత్రి మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వాహనాల అనుమతి లేదన్నారు. ఆదివారం ఎలాంటి డ్రోన్లు ఎగురవేయడానికి అనుమతి లేదన్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం దృష్ట్యా విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలన్నారు.

వాహనాల మళ్లింపు

కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలు ధరూర్ కెనాల్ నుంచి బైపాస్ ద్వారా కోరుట్ల వైపు వెళ్లాలి. నిజామాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి బైపాస్ ద్వారా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాలి.

ధర్మపురి నుంచి కరీంనగర్ వైపు వెళ్లేవారు తమ వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కరీంనగర్ నుంచి ధర్మపురి వైపు వెళ్లేవారు తమ వాహనాలను ధరూర్ కెనాల్ మీదుగా తిమ్మాపూర్ బైపాస్ మీదుగా పొలాస గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

ధర్మపురి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా బైపాస్ రోడ్‌లో కోరుట్ల వైపు వెళ్లేలా దారి మళ్లించారు. ట్రాఫిక్ ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు తెలిపారు.

అలరించిన విద్యార్థుల ఆటాపాట



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల, మార్చి 16 : పట్టణంలోని మాస్ట్రో కళాశాలలో శనివారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం అలరింపజేసింది. పట్టణంలోని మాస్ట్రో బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపల్స్ పోతని ప్రవీణ్, సత్యనారాయణ, మహాదేవ్, రమేష్, దీపక్, ఎంపె బారీ, రాజేంద్రప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ధర్మపురి జడ్జి శ్యాంప్రసాద్

ధర్మపురి, మార్చి 16: వేసవిలో కోర్టుకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బందికి దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మపురి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్యాంప్రసాద్ అన్నారు. ధర్మపురి కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మహేందర్‌సింగ్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, న్యాయవాదులు రౌతు రాజేష్, రామడుగు రాజేష్, గూడ జితేందర్‌రెడ్డి, జాజాల రమేష్, బత్తిని ఇంద్రకరణ్, కస్తూరి శరత్ తదితరులు పాల్గొన్నారు.

శీతాకాల శిబిరాలు

విద్యార్థుల్లో సేవా బావాన్ని పెంపొందిస్తాయి

కొడిమ్యాల, మార్చి 16 : శీతాకాల శిబిరాలు విద్యార్థుల్లో సేవాభావం, వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తాయని ఎంపీడీవో స్వరూప అన్నారు. శనివారం కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఎన్ఎస్ఎస్ రెండు యూనిట్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్లు గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. ఏడు రోజుల పాటు నిర్మాణాత్మక సేవలు చేయటానికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఆర్ గోపాలక్రిష్ణ మాట్లాడుతూ కొడిమ్యాల, కొండాపూర్ గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలక్రిష్టారెడ్డి, మాజీ ఉప సర్పంచు జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ మహేష్, కొడిమ్యాల జూనియర్ కళశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు ఆదిరెడ్డి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డా. ఆర్ గోపీకృష్ణ, కె. సతీష్‌కుమార్, పలువురు అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులు

పెగడపల్లి, మార్చి 16: మండల కేంద్ర ప్రజల చిరకాల వాంఛ ఎట్టకేలకు తీరుతోంది. మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో మొరపెట్టుకోగా మూడేండ్ల క్రితం అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ నంది చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ సమీపంలోని పెట్రోల్ పంపు వరకు సెంట్రల్ లైటింగ్, రోడ్డు డివైడర్‌తో పాటు నాలుగు వరుసల రహదారి తార్ రోడ్డు నిర్మాణానికి రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. కాగా రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మూడేండ్లుగా నత్తనడకన పనులు చేయడంతో రోడ్డు నిర్మాణంపై ఆశలు వదులుకున్నారు. రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్ నుంచి సింగిల్‌విండో క్రాసింగ్ వరకు బీటీ పనులు చేపట్టడంతో ప్రజలు తమ కోరిక నెరవేరనుందని పేర్కొంటున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రాయికల్, మార్చి 16: రాయికల్ పట్టణంలోని 3వ వార్డులో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, మురిక కాలువల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు శనివారం భూమిపూజ చేశారు. సీడీపీ నిధులు రూ.4 లక్షలు, డీఎంఎల్‌టీ నిధులు రూ.4 లక్షలు కేటాయించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ధర్మపురి దేవస్థానం ఉత్సవ కమిటీ ఏర్పాటు

ధర్మపురి, మార్చి 16: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉత్సవ కమిటీ ఏర్పాటు కోసం సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఈ నెల 13న లేఖను అందించారు. రాష్ట్ర ఎండోమెంట్ కమీషనర్ 13 మంది సభ్యులతో కూడిన కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ సభ్యులుగా జక్కు రవీందర్, ముత్తినేని మల్లేశం, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేష్, లసెట్టి సుజాత, కొమురెల్లి పవన్‌కుమార్, నేదునూర్ శ్రీధర్ ఉన్నారు. సభ్యులు ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 5 వరకు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ సభ్యులను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

హనుమాన్ ఆలయ కమిటీ బాధ్యతల స్వీకరణ

రాయికల్, మార్చి 16: పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయానికి నియమించిన కమిటీ చైర్మన్, సభ్యులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో స్వామివారి ఎదుట ప్రత్యేక వేద మంత్రాల సాక్షిగా పూజలు నిర్వహించి ఆలయ ఈవో విక్రమ్ గౌడ్ చేతుల మీదుగా సత్కరించి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, సభ్యులు కల్లెడ రాజు, రాయిల్ల ప్రభాకర్, నారంశెట్టి మనోజ్, ఒజ్జెల రాజరెడ్డి, నోముల జ్యోతి, సందెలు గణేష్‌లకు నియామక పత్రాలు అందజేశారు అనంతరం మాజీ ఆలయ చైర్మన్ సత్యనారాయణకు నూతన కమిటీ సభ్యులు వీడ్కోలు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భరత్ శర్మ, సతీష్ శర్మ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మ్యాకల అనురాధ, కొయ్యడి మహిపాల్, ఎద్దండి దివాకర్, బాపురపు నర్సయ్య, కటుకం రాజేశం, బత్తిని నాగరాజు, కాటిపెల్లి రాంరెడ్డి, రాజేష్, ఎండీ షాకీర్, రాకేష్ నాయక్ పాల్గొన్నారు.

ప్రకృత్తి విపత్తులలో ప్రాణ రక్షణపై అవగాహన

రాయికల్, మార్చి 16: రాయికల్ పట్టణంలో జాతీయ ప్రకృతి విపత్తు ప్రతిస్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ఆధ్వర్యంలో తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం అధ్యక్షతన శనివారం ప్రకృతి విపత్తుల వల్ల ప్రాణ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా కాపాడుకోవాలో వివరించారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేసే విధానం, అనారోగ్య సమస్యల నుంచి బయటపడే మార్గాలను వివరించారు. వరదలు వచ్చినప్పుడు ఇంటి వద్దే ఉన్న పరికరాలతో ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించారు. లైఫ్ జాకెట్ థర్మాకోల్ షీట్‌తో తయారు చేసే విధానం, నూనె డబ్బాలు, క్యాన్, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్లతో వరదలు వచ్చినప్పుడు ప్రాణాలు రక్షించుకునే పరికరాలు తయారు చేసే విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ కుమార్, సరోజ్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, జడ్పీటీసీ అశ్విని జాదవ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అనిల్, రాజేశ్వర్ రెడ్డి, లోకేష్, ఆచారి పాల్గొన్నారు.

రంజాన్ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

మెట్‌పల్లి, మార్చి, 16 : ముస్లిం పవిత్ర మాసంలో జరుపుకొనే రంజాన్ వేడుకలు పశాంతం వాతావరణంలో జరుపుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. శనివారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకరావలన్నారు. మసీదుల వద్ద ఎవరైనా అనుమానితులు కనబడి, మత విద్వేషాలకు పాల్పడిన వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎవరైనా మతాలను విమర్శించకుండా తమ పండుగలను ప్రశాంత జరుపుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి, ముస్లిం నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా..

బీఆర్ఎస్ రాస్తారోకోలు

ధర్మపురి, మార్చి 16: నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుకు నిరసనగా ధర్మపురి మండల కేంద్రంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారి 63 పైన బైఠాయించి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ మార్చి 15 తెలంగాణకు చీకటి రోజుగా అభివర్ణించారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసమే బీజేపీ, కాంగ్రెస్ కలిసి కవిత అరెస్టుకు కుట్ర పన్నినట్లు ఆమె ఆరోపించారు. అక్రమ కేసులను రాజకీయంగా, చట్టపరంగా కోర్టులో ఎదుర్కొంటామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బందితో చేరుకుని నాయకులకు, కార్యకర్తలకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు మొగిలి శేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు శనివారం నల్ల జెండాలతో ధర్నా చేశారు. అరగంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వంతో కేసీఆర్ కుటుంబంపై కక్షగట్టి ఎమ్మెల్సీ కవితను అకారణంగా అరెస్టు చేయడం సరికాదని, మోదీ తీరు సరి కాదన్నారు. మోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు నిదర్శనమని, తక్షణం అరెస్టు చేసి వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జడ్పీటీసీ అశ్విని జాదవ్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, సాయి, కన్నాక మహేందర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: బీజేపీ సర్కార్ ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు నిర్వహించిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేయటం అన్యాయం అన్నారు. ఈ నిరసనలో ఎంపీపీ స్వర్ణలత, సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రాజేందర్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, ఎంపీటీసీలు లక్ష్మన్, సిందుమహేందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కోరుట్ల: బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామని మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య-అనిల్, జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తప్పుడు కేసులను పెట్టి బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులోకి నెడుతుందన్నారు. కేసులకు బయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యాటం పద్మ, బలిజ పద్మ, జిందం లక్ష్మినారాయణ, మోర్తాడ్ లక్ష్మినారాయణ, పేర్ల సత్యం, గడం గంగాధర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుకు నిరసనగా పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టి బొమ్మను దహనం చేసిన నిరసన తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు. శనివారం బీఆర్ఎస్ శ్రేణులు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి పాత బస్టాండ్ చౌరస్తాలోని జాతీయ రోడ్డుపై బైఠాయించి మోదీ డౌన్ డౌన్ అంటూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మారు సాయిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనివేచిత ధోరణితో సుప్రిం కోర్టులోని పిటిషన్ తీర్పు రాకముందే కక్ష పూరితంగా ఎమ్మెల్సీ కవిత ఇంట్లో ఈడీ ఐటీ దాడులు చేయడం, సుప్రీం కోర్టు తీర్పును దిక్కరించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, చంద్ర శేఖర్ రావు, రాజారెడ్డి, పీసు తిరుపతిరెడ్డి, కట్టా శ్రీధర్, కోరెపు రవి, బద్దం శేఖర్‌రెడ్డి, జగన్‌గౌడ్, రఘుపతిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, జియా, గంగాధర్, మహేందర్ పాల్గొన్నారు.



ధర్మపురి కమలాపూర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ రాస్తారోకో



రాయికల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మెట్‌పల్లిలో పాతబస్టాండ్ చౌరస్తాలో..



కోరుట్లలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నృసింహుడి హుండీ ఆదాయం రూ 31,29,424

ధర్మపురి, జనవరి 16: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించగా రూ 31,29,424 ఆదాయం లభించింది. ఈ ఏడాది జనవరి 11 నుంచి మార్చి 16 వరకు గల 64 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 15 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 100 గ్రాముల మిశ్రమ వెండి, 50 విదేశీ నోట్లు లభించాయి.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, దేవాదాయ శాఖ జగిత్యాల ఇన్స్‌పెక్టర్ రవికిరణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకటరావు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహుని హుండీ లెక్కిస్తున్న వలంటీర్స్

రాజీమార్గంతోనే కేసులను పరిష్కరించుకోవాలి

మెట్‌పల్లి మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్



మెట్‌పల్లి కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

మెట్‌పల్లి, మార్చి, 16 : క్షణికావేశంలో చేసిన నేరాలకు కోర్టుల చుట్టూ తిరిగి వ్యయప్రయాసలకు గురికాకుండా రాజీమార్గం ద్వారా ఇరువర్గాల వారు కేసులను పరిష్కరించుకుంటే న్యాయం దొరుకుతుందని మెట్‌పల్లి మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా బార్ అసోసియేషన్, న్యాయవాదుల ఆధ్వర్యంలో మెట్‌పల్లి కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పలు క్రిమినల్, కుటుంబ తగాదాలు, భార్యాభర్తల వివాదాలు కేసులు, డ్రంకెన్ డ్రైవ్ తదితర 370 కేసులు, 2 బీఎస్ఎన్ఎల్ కేసులు, ఒక బ్యాంక్ కేసు, 15 రాజీ మార్గంలో కక్షిదారులు పరిష్కరించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు వివిధ చట్టాలపై కక్షదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను వారి వెంటా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఓజ్జెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్, న్యాయవాదులు వెంకటస్వామి, శంకర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, భూమేశ్వర్, శ్రీనివాస్, హఫీజ్, వెంకటేశ్వర్లు, భానుమూర్తి, స్రవంతి, నర్సయ్య, శేఖర్, సుధాకర్, జగన్, రాజేందర్, భూషణ్, రాజేందర్, అశోక్ పాల్గొన్నారు.

అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్న ఎంపీకి మద్దతు తెలిపాలి



ప్రొసీడింగ్స్ అందిస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 16 : నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు మరోసారి మద్దతు తెలపాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని పురాతనమైన కొండ స్వామి ఆలయం ఆవరణలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఎంపీ మంజూరు చేసిన రూ. 4లక్షల విలువ గల చెక్కును నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేశారు. నిజామాబాద్ పార్లమెంట్ బరిలో ఉన్న అర్వింద్‌ను అత్యధిక మోజార్టీతో గెలుపించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు ఏర్పాటు, పసుపుకు ధరలు పెండగడానికి ప్రధానంగా బీజేపీ పార్టీయే కారణమన్నారు.

నిషేధిత నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం

- రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ ఆధ్వర్యంలో జాయింట్ ఆపరేషన్
- వైద్యుడు అరెస్టు, హైదరాబాద్‌లోని కుషాయిగూడలో రిమాండ్

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంగా నిషేధిత నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం కొన్ని రోజులుగా జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఈఎన్‌టీ వైద్యుడు మధన్ మోహన్ ఇదంతా చేస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈఎన్‌టీ వైద్యునికి సంబంధించిన ఆసుపత్రి అటాచ్‌డ్ పార్మసీలో సోదాలు నిర్వహించారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్, కుషాయిగూడ, జగిత్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జాయింట్ ఆపరేషన్‌లో అనేక నిజాలు బయట పడ్డాయి. 379 యాంపుల్స్, 76 ట్యాబ్లెట్స్, 2 ప్యాచెస్, 11 వాయిల్స్ నిషేదిత నార్కోటిక్ డ్రగ్స్‌గా గుర్తించి వాటిని సీజ్ చేశారు. వీటిని వైద్యుడు గుట్టు చప్పుడు కాకుండా హైదరాబాద్‌లోని సైనిక్‌పురి ప్రాంతానికి కోరియర్ ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వైద్యుడిని అదుపులోకి తీసుకుని శనివారం రోజంతా అధికారులు విచారించారు. నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగానికి పాల్పడిట్లు గుర్తించిన అధికారుల ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు ఎన్‌డీపీ ఎస్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అధికారులు ఇచ్చిన నివేదికలో జగిత్యాలకు చెందిన వైద్యుడు మధన్ మోహన్ రెండేళ్లుగా ఈ దందాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఆసుపత్రి అటాచ్‌డ్ కౌంటర్ డ్రగ్ లైసెన్స్ కూడా రద్దు చేయనున్నట్లు నివేదికలో వివరించారు.



సోదాలు నిర్వహిస్తున్న డ్రగ్ కంట్రోల్ అధికారులు

అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్ అందజేత

కోరుట్ల, మార్చి 16 : పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయ అనుబంధ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, టీటీడీ కల్యాణ మంటపం, షాదిఖానాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రొసిడింగ్ పత్రాలను శనివారం కాంగ్రెస్ నాయకులు సంబదింత నిర్వహకులకు అందించారు. వెంకటేశ్వర దేవాయ అనుబంధ షాపింగ్ నిర్మాణంతో పాటు టీటీడీ కళ్యాణ భవన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 70.50 లక్షల నిదుల ప్రొసిడింగ్ పత్రాలను దేవాలయ అర్చకుడు బానూమర్తితో పాటు దేవాలయ శాఖ అధికారులకు అందించారు. పట్టణంలోని షాదిఖానా అభివృద్ధికి రూ. 38లక్షల మంజూరు పత్రాలను సంబంధిత నిర్వాహకులకు కాంగ్రెస్ నాయకులు అందించారు.

ఈ సందర్భంగా నిధులు మంజూరికి కృషి చేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ల్ ఎంబేరి నాగభూషణం, నాయకులు ఆడెపు మధు, తిరుమల గంగాధర్, కొంతం రాజం, మచ్చ కవిత, సంగం లింగం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెట్‌పల్లి : మెట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన నిజామాబాద్‌కు చెందిన ఇద్దరిని వెంకట్రావుపేట శివారులో పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి విలు తెలిపారు. శనివారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలిపారు. పట్టణానికి చెందిన ధనాలకోట శ్రీనివాస్ ఆటోను కూరగాయాల మార్కెట్‌లో నిలిపి దుకాణంలోకి వెళ్లాడు. నిజామాబాద్‌కు చెందిన షేక్ అలీ, షేక్ ఫజిల్ అను ఇద్దరు దొంగలు ఆటోను ఎత్తుకెళ్లారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం వెంకట్రావుపేట గ్రామ శివారులో సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టగా అదే సమయంలో ఆటోలో వచ్చిన షేక్ అలీ, షేక్ ఫజిల్ ఇద్దరు అనుమానంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించడంతో వివరాలు తెలిపారు. ఆటోను స్వాధీనం చేకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై చిరంజీవి, ఏఎస్సై అశోక్‌రావు, మహేందర్, సంతోష్‌ను సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.

కొడిమ్యాల: జిల్లా కేంద్రం జగిత్యాలలో ఈ నెల 18న భారత ప్రదాని నరేంద్రమోదీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కోరారు.

● మండల కేంద్రంలోని అంగడి బజారు నుండి పాత పోలీస్ స్టేషన్ వరకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మంజూరు చేసిన 20లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం బీజేపీ నాయకులు ప్రారంభించారు.

కొడిమ్యాల : మండలంలోని సండ్రల్లపల్లి పాఠశాలలో తిర్మాలాపూర్, సండ్రల్లపల్లి, పోతారం అంగన్ వాడీ సెంటర్‌లలో శనివారం పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పోషక ఆహారం తీసుకోవటం వలను కలుగు ప్రయోజనాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకర్, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మీ, పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: విద్యార్థులు పరీక్షలని భయపడకుండా రాసి మంచి ఫలితాలను సాంధించాలని మున్నాభాయ్ హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ మున్నాభాయ్ అన్నారు. శనివారం ఆత్మకూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు మున్నాభాయ్ హెల్పింగ్ ఫౌండేషన్ ద్వారా ఆయన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు మెటీరియల్‌లను అందజేశారు.

జగిత్యాల: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మూడు నెలల నుంచి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సెకండ్ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పడాల మమతతో పాటు జగిత్యాల జిల్లాలో పలువురు సెకండ్ ఏఎన్ఎం సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైద్రాబాద్ కోటిలోని ఎన్‌హెచ్ఎం సీఎఫ్‌డబ్ల్యూ కమిషనర్ కర్ణన్‌ను కలిసి సమస్యలను విన్నవించారు.

కోరుట్ల : భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన అష్టావధానం అలరింపజేసింది. పట్టణంలోని సీనారే కళాభవనంలో భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవ వేడుకలను రెండవ రోజు సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. అధ్యక్ష కార్యధర్ములు కంజర్ల రామాచర్య, బట్టు హరికృష్ణ, విశ్రాంతి ఉపన్యాసకులు డాక్టర్ లక్ష్మణ్‌రావు చేసిన అష్టావధానం సాహితి ప్రయులను అలరింపజేసింది. ప్రతి సంవత్సరం డాక్టర్ అందే వేంకటరాజం స్మారక పురస్కారాన్ని లక్ష్మణ్ రావుకు అందించి సత్కరించారు.

మెట్‌పల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెస్ బకాయిలు వెంటనే చెల్లించాలని కార్మికులు శనివారం మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపి సిబ్బంది వినతి పత్రం అందజేశారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గొడిసెల రాజయ్య-శంకరమ్మ కూతురు వివాహం కోసం శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రూ 10 వేలు ఆర్థికసాయం ప్రకటించారు. కమలాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఒడ్డేటి మల్లేశం-లక్ష్మి కూతురు వివాహం కోసం కూడ ఆయన రూ 10 వేలు ఆర్థికసాయం ప్రకటించారు.

మల్యాల: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం పట్ల మల్యాలలో బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మిట్టపెల్లి సుదర్శన్, బద్దం తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గడ్డం రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.